క్లుప్తంగా

ఇద్దరు అరెస్ట్

కడప అర్బన్ : చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్జీఓ కాలనీలో నివాసం వుంటున్న పూల లక్ష్మిదేవి, పూల శిరీషలను గురువారం ఎస్ఐ రవి కుమార్ తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వీరిపై గతంలో గంజాయి కేసులున్నాయనీ, వాటిల్లో పెండింగ్‌లో వున్న కేసులకు సంబంధించి అరెస్ట్ చేశామని తెలియజేశారు.

యువతను విస్మరిస్తున్న బీజేపీ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దేశంలో, రాష్ట్రంలో నిరుద్యోగ యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బొజ్జా తిరుమలేష్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో యువతతో సమావేశాన్ని నిర్వహించారు. ఏపీపీఎస్సీ గ్రూప్ 1,2,4 తోపాటు ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్, ఇంజనీరింగ్, ఉపాధ్యాయులు, వివిధ కళాశాలల అధ్యాపకులు, విశ్వవిద్యాలయ అధ్యాపకులు వంటి ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వాటి భర్తీకి చర్యలు చేపట్టాలన్నారు.

వృద్ధురాలు అదృశ్యం


అదృశ్యమైన వృద్ధురాలు

కడప అర్బన్ : కడప నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జ్ఞానమణి దేవయాని (74) అనే వృద్ధురాలు ఈనెల 7వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తరువాత కనిపించలేదని ఆమె కుమారుడు సువర్ధన్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో వృద్ధురాలి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప టూటౌన్ ఎస్ఐ సంజీవ రాయుడు తెలిపారు.

29న దూదేకుల సింహ గర్జన

కడప రూరల్ : ఈ నెల 29వ తేదీన గుంటూరులో నిర్వహించే నూర్‌బాష్ దూదేకుల సింహ గర్జన సభను జయప్రదం చేయాలని ఏపీ దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రాయల్‌బాబు, రాష్ట్ర నాయకులు చిన్న రాజా, కేపీ హుస్సేన్ తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు సింహ గర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దూదేకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలన్నారు. కార్యక్రమంలో కమాల్‌బాష, మౌలాలి, చెంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉర్దూ కవి సమ్మేళనం

కడప కల్చరల్ : కడప బజ్మె జావీద్ ఉర్దూ సాహితి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ సాయంత్రం 6.30 గంటల కు కడప కోటగడ్డవీధిలోని సాహిర్ మంజిల్‌లో ఉర్దూ కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు రిటైర్డ్ ప్రొఫెసర్ సత్తార్ సాహిర్ తెలిపారు. ఈ సమ్మేళనంలో రాయచోటి బజ్మె సాఖి ఎ సుఖన్ సంస్థ స్థాపకుడు డాక్టర్ ఇమాం ఖాసీం సాఖి, ముఖ్య అతిథిగా జెమ్స్ హైస్కూల్ డైరెక్టర్ మజ్హర్ అలీఖాన్‌లు పాల్గొంటారన్నారు. డాక్టర్ ఖాజాపీర్ పర్యవేక్షిస్తారన్నారు. జిల్లాలోని ఉర్దూ కవుల సాహితీ, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.


అభినందన

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ వైష్ణవి ప్రీ రిపబ్లిక్ డే వేడుకలకు ఎంపికవడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా అభినందించారు. గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వలంటీర్‌ను అభినందించారు. ఇటీవల వైవీయూలో నిర్వహించిన విశ్వవిద్యాలయస్థాయి ఎంపికల్లో కళాశాలకు చెందిన బీజెడ్‌సీ తృతీయ సంవత్సరం విద్యార్థిని వైష్ణవి సాంస్కృతిక నృత్యాలు, గేయాలు వంటి అంశాల్లో చక్కటి ప్రతిభ కనబరిచి విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించే ప్రీ రిపబ్లిక్ డే వేడుకలు ఎంపికైంది.

కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పుల్లయ్య

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా చెప్పలి పుల్లయ్యను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జాతీయ అధ్యక్షుడు ఉదిత్ రాజు చేతులమీదుగా నియామక పత్రం అందజేయడం జరిగిందన్నారు.

కంటి ఆరోగ్యంపై దృష్టి సారించాలి


ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ సునీత

కడప అర్బన్ : కంటి ఆరోగ్యంపై దృష్టి సారించి, క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం వలన కంటి వ్యాధులు అరికట్టవచ్చని డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు తెలియజేశారు. ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని కడపలోని పుష్పగిరి విట్రియో రెటినా ఇన్‌స్టిట్యూట్, కడపలోని డిబిసిఎస్‌తో కలిసి కలెక్టరేట్ నుంచి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, డీపీఎం డాక్టర్ సునీత జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో పుష్పగిరి కంటి ఆసుపత్రి యూనిట్ హెడ్ సూర్యప్రకాష్, జీఎం సురేష్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పు

ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా


'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాషా పేర్కొన్నారు. గురువారం స్థానిక రామరాజుపల్లెలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' 9వ క్యాంపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు అన్నారని, అందరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం కూడా ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి వైద్య ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రజల ముంగిటకే వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 11 రకాల పరీక్షలను కూడా నిర్వహించి ఉచితంగా మందులు కూడా పంపిణీ చేస్తున్నారన్నారు. తొలుత డిప్యూటీ సీఎం 'ఆరోగ్య సురక్ష' శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రతి స్టాల్ ను పరిశీలించి, వైద్యులతో, సిబ్బందితో అక్కడికి విచ్చేసిన రోగులతో వివరాలు అడిగి తెలుసుకొని కొన్ని సూచనలు చేశారు. తర్వాత రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, తోటక్రిష్ణ, రామ్మోహన్‌రెడ్డి, కె. రాజశేఖర్‌రెడ్డి, ఎన్ సుబ్బారెడ్డి, మధువర్ధన్‌రెడ్డి, షఫీ, అంజి, శివా నాయక్, సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు


ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నారు. గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా 5వ డివిజన్‌లోని అశోక్ నగర్ ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల,మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ఆయన్ను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు.

ఈ సందర్భంగా చింతల మహేశ్వరి అనే మహిళ తనకు జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన, అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, పింఛన్ కానుక, సున్నావడ్డీ, ఇంటి స్థలం ద్వారా రూ.11.61లక్షల లబ్ధి కలిగిందని ఆనందం వ్యక్తం చేసింది. జి. చంద్రకళ అనే మహిళ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో తమకు వివిధ పథకాల ద్వారా రూ.9.31 లక్షల వరకూ మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేసింది. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇంత లబ్ధి చేకూరలేదని, జగనన్నకు తామంతా తోడుగా ఉంటామని తెలిపింది.

ఈ కార్యక్రమంలో 5వ డివిజన్ ఇన్‌చార్జి బండి ప్రసాద్, పార్టీ నాయకులు జయచంద్రారెడ్డి, రామమోహన్‌రెడ్డి, తోటక్రిష్ణ, శ్రీరంజన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, చాంద్‌బాషా, మియ్యా, షఫీవుల్లా, పస్తం అంజి, మునిశేఖర్‌రెడ్డి, మహిళా నేతలు పత్తిరాజేశ్వరి, రామలక్షుమ్మ, తులశమ్మ, నారాయణమ్మ, నారాయణమ్మ, విజయకుమారి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎన్ఎంయూఏ రీజినల్ ప్రెసిడెంట్ నాగముని

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప డిపోలో పనిచేస్తున్న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఎన్ఎంయూఏ రీజినల్ ప్రెసిడెంట్ నాగముని, సంయుక్త కార్యదర్శి దాస్ కోరారు. గురువారం కడప ఆర్టీసీ బస్టాండు ఆవరణలో అధికారుల తీరును నిరసిస్తూ డిపో కార్యదర్శి సగినాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్లను బలవంతంగా టిమ్ డ్యూటీలకు పంపడం దారుణమన్నారు. రద్దు పరిచిన సర్వీసులను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. వెహికల్ కండీషన్‌ను పూర్తి స్థాయిలో మెరుగు పరచాలని తెలిపారు. కండక్టర్లు, డ్రైవర్ల ఫిక్స్‌డ్ చార్జును వేయాలని కోరారు. డిపో అధికారులు అసోసియేషన్ నాయకుల పట్ల అనుచిత వైఖరిని విడనాడాలన్నారు. అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయాలన్నారు. డిపో గ్యారేజీలో ఉద్యోగులకు మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షులు జయరాం, కోశాధికారి టీఎం బాష, వైస్ ప్రెసిడెంట్ నిజాముద్దీన్, సుబ్బారావు, గ్యారేజీ అధ్యక్షుడు రవి, ప్రభాకర్, వరదారెడ్డి, జబ్బార్, మున్ను తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసులు సేవలు అభినందనీయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న సగినాల శ్రీనివాసులు సంస్థకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్షులు పీవీ శివారెడ్డి, రీజినల్ సెక్రటరీ సుధాకర్‌లు కొనియాడారు. ఈనెల 6న విజయవాడలో ఏపీఎస్ ఆర్టీసీ సీసీఎస్ 68వ జనరల్ బాడీ సమావేశంలో అత్యధిక ఆర్డీలు చేసినందుకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారా సగినాల శ్రీనివాసులు అవార్డు పొందారు. ఈ సందర్భంగా కడపలో గురువారం ఎన్ఎంయూ యూనియన్ కార్యాలయంలో ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రీజినల్ ప్రెసిడెంట్ నాగముని, జాయింట్ సెక్రటరీ దాస్, కడప డిపో అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అమృత్ కలశయాత్ర


ఆర్ట్స్ కళాశాలలో అమృత కలశయాత్రలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వైవీయూ : 'మేరీ మట్టీ.. మేరీ దేశ్' కార్యక్రమంలో భాగంగా కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో గురువారం అమృత్ కలశయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు మాతృభూమి పట్ల బాధ్యత పెరుగుతుందన్నారు. అనంతరం కళాశాల ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సర్కిల్‌లో..

కడప నగరం ఆర్‌టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మేరీ మట్టి మేరీ దేశ్ కార్యక్రమం నిర్వహించారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకటరామిరెడ్డి మాట్లాడారు. వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన మట్టిని అమృత కలశాల ద్వారా ఢిల్లీలో అమృతవాటికను నిర్మిస్తారని తెలిపారు. అనంతరం సేకరించిన మట్టిని నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ సుబ్బ నరసయ్య పాల్గొన్నారు.

వైవీయూలో..

యోగివేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్ 2, యూనిట్-5 ఆధ్వర్యంలో వేర్వేరుగా స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రాం ఆఫీసర్ డా. ఎస్.పి. వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డా. ఎస్. రఘునాథరెడ్డి కార్యాలయ ఆవరణంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చిమొక్కలను తొలగించారు. యూనిట్-5 ప్రోగ్రాం ఆఫీసర్ డా. వి. సునీత ఆధ్వర్యంలో సీవీ రామన్ సైన్స్‌బ్లాక్ ఆవరణంలో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు.

నాసిరకపు శనగలు సరఫరా చేస్తే ఎలా..?

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో రబీ సీజన్లో శనగ పంటను సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం సరఫరా చేసిన విత్తన శనగలు నాసిరకంగా ఉన్నాయని, సరఫరా చేసిన కాంట్రాక్టర్ పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి తెలిపారు. గురువారం సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ విత్తన అభివృద్ధి సంస్థ ద్వారా శనగలు కాంట్రాక్టర్‌కు అప్పచెప్పారని సీడ్స్ సర్టిఫికేషన్ ఆఫీసర్లు కాంట్రాక్టర్ తో లాలూచీ పడిన కారణంగానే నాసిరకపు శనగలు రైతులకు పంపిణీ చేశారన్నారు. కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలన్నారు.

నగరపాలక కార్యాలయాన్ని పరిశుభ్రంగా మార్చాలి


సూచనలు ఇస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ కార్యాలయాన్ని పరిశుభ్రంగా తయారు చేయాలని కేఎంసీ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. గురువారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన కేఎంసీ ఆఫీసు, ఉక్కాయపల్లె, నానాపల్లె ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక కార్యాలయం వెనుకవైపు లెవెల్స్ చూసి డ్రైనేజీ కాలువ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే 5 మీటర్ల వెడల్పుతో రోడ్డు ఏర్పాటు చేయాలని, దెబ్బతిన్న గోడలను పునర్నిర్మించాలన్నారు. పాత కడప నుంచి నానాపల్లె హైవే వరకూ 7 మీటర్ల వెడల్పుతో బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలన్నారు.

అభిప్రాయ సేకరణ విభాగం ఏర్పాటు


అభిప్రాయ సేకరణ విభాగం సాఫ్ట్‌వేర్‌ను ప్రారంభిస్తున్న వైవీయూ వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో ఇంటర్నెట్ ఆధారిత అభిప్రాయ సేకరణ విభాగాన్ని ఏర్పాటు చేశారు. విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించే విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకుల నుంచి అభిప్రాయాలను ఆన్‌లైన్ ద్వారా తెలియజేసేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభిప్రాయ సేకరణ పూర్తి పారదర్శకంగా, సులభతరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి, ఐటీసెల్ సంచాలకులు ఆచార్య ఎం.వి. శంకర్, పీఆర్ సెల్ డైరెక్టర్ డా. ఎస్.వి. సుబ్బారెడ్డి, ఐక్యూఏసీ సెల్ డైరెక్టర్ డా. సుబ్రమణ్యం శర్మ పాల్గొన్నారు.

భుజంగరావు సేవలు చిరస్మరణీయం

కడప ఎడ్యుకేషన్ : ఆర్జేయూపీ సంఘం వ్యవస్థాపకులుగా ఉపాధ్యాయుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి మాజీ ఎమ్మెల్సీ దివంగత భుజంగరావు సేవలు చిరస్మరణీయమని ఆర్జేయూపీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసులు అన్నారు. భుజంగరావు 15వ వర్ధంతి సందర్భంగా గురువారం కడపలోని ఆర్జేయూపీ కార్యాలయంలో ఆయన విగ్రహానికి కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబుల్‌రెడ్డి, టీచర్స్ హోం ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, కుటుంబ సభ్యులు అనసూయదేవి, రాజగోపాల్, బృజేష్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని చెన్నూరు మండలం కైలాసగిరికోన ఎస్టీకాలనీలో నూతనంగా ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు కృషి చేసిన స్వచ్ఛంద సేవకురాలు దాదిరెడ్డి గారి భాగ్యమ్మను డీఈఓ రాఘవరెడ్డి ఘనంగా సన్మానించారు. గురువారం కడపలోని డీఈఓ కార్యాలయానికి ఆమెను పిలిపించి ఆమె చేసిన కృషికి శాలువాతో సన్మానించి అభినందించారు.

నైపుణ్యం పెంచుకోవాలి


విద్యార్థికి బహుమతిని ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులు విద్యతోపాటు అన్ని రకాల నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప అక్కాయపల్లె సాయిబాబా విద్యాసంస్థలో 'స్కిల్ కార్నివాల్' వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ విచ్చేసి మాట్లాడారు. సాయిబాబా విద్యాసంస్థల వైస్ చైర్మన్ సాయిధీరజ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రెండేళ్ల క్రితం సాయిబాబా వింగ్ పాఠశాలను స్థాపించామని, విద్యార్థులకు విద్యే కాకుండా ఇతర రంగాల నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. స్థానిక కార్పొరేటర్ ఎంవీ శ్రీదేవి, ప్రిన్సిపాల్ అనితాప్లారెన్స్, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

కడప కార్పొరేషన్ : కడప నగరం దేవునికడప ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ నాయకులు చైతల్య ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్. సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప మార్కెట్ యార్డు డైరెక్టర్ పి. సంపత్ కుమార్ జన్మదిన సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ సునీల్ కుమార్, రామక్రిష్ణ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

15 నుంచి వాసవాంబ నవరాత్రి ఉత్సవాలు


ఉత్సవాల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

కడప కల్చరల్ : శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి నవరాత్రి ఉత్సవాలను ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని కడప ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మునగా శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ బెస్తవేముల రామమహేష్, కోశాధికారి కాంభోజి గోపాలకృష్ణ తదితరులు తెలిపారు. గురువారం కడప నగరంలోని అమ్మవారిశాల ప్రాంగణంలోగల వాసవీ సదన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు దసరా ఉత్సవాల వివరాలతో ప్రచురించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఆర్యవైశ్య సంఘం సహాయ కార్యదర్శి చింతకుంట పుల్లయ్య, యాదాళ్ల రమణ, కోశాధికారి మేడా సుమంత్ కుమార్‌లు మాట్లాడుతూ ఆలయ చరిత్ర గురించి వివరించారు.

అమ్మవారి అలంకారాలు

ఉత్సవాల్లో భాగంగా ఈనెల 15న తొలిరోజు అమ్మవారికి దీక్షా బంధన అలంకారం, 16న శ్రీ రాజరాజేశ్వరీదేవి, 17న శ్రీ అన్నపూర్ణాదేవి, 18న శ్రీ గజలక్ష్మిదేవి, 19న శ్రీ మోహిని అలంకారం, 20న శ్రీ సరస్వతిదేవి, 21న శ్రీ త్రిపుర సుందరీదేవి, 22న శ్రీ మహిషాసుర మర్దిని అలంకారం నిర్వహిస్తారు. 23వ తేదీన విజయదశమి సందర్భంగా హోమాలు, శమీ దర్శనం, రాత్రి గ్రామోత్సవం ఉంటుందన్నారు. 24న రాత్రి పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

అధిక దిగుబడులను సాధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య

కడప అగ్రికల్చర్ : శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను పాటించి రైతులు అధిక దిగుబడులను సాధించాలని కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ వీరయ్య సూచించారు. గురువారం కేవీకేలో ముద్దనూరు మండల వాటర్ షెడ్ రైతులకు కేవీకే, జిల్లా నీటియాజమాన్యసంస్థ సంయుక్తంగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కేవీకే నమూనా క్షేత్రంలో వానపాముల యూనిట్ల తయారీ కేంద్రం, బ్లాక్ బెంగాల్ మేకలు, గొర్రెల పెంపకం కేంద్రం, కోళ్ల పెంపక కేంద్రంతోపాటు చిరుధాన్యాల జోడించే యూనిట్, పుట్టగొడుగుల పెంపక కేంద్రంతోపాటు షెడ్ నెట్‌లో పెంచుతున్న వివిధ ఉద్యాన పంటలను, ప్రకృతి వ్యవసాయ విధానంలో పండిస్తున్న కంది, డ్రాగెన్‌ఫ్రూట్, చింత వంటి వాటిని వీక్షించారు. అనంతరం కేవీకే ద్వారా పండించిన వివిధ పంటల నాణ్యమైన విత్తనాలు, అంటు మొక్కలను, అలాగే వానపాముల ఎరువులు, పుట్టగొడుగులు, డ్రాగన్‌ఫ్రూట్, కూరగాయలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శిల్పకళ, సాయి మహేశ్వరి, మానస, మహేష్ బాబు, స్వామి చైతన్యలతోపాటు వాటర్‌షెడ్ ప్రాజెక్టు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉండాలంటే నడక అవసరం

కడప నగర మేయర్ కె. సురేష్‌బాబు


ర్యాలీలో మేయర్ సురేష్‌బాబు, ప్రజలు

కడప అర్బన్ : ప్రాచీన కాలంలో మన పూర్వీకులు నడక ద్వారానే అన్ని పనులు పూర్తి చేసేవారని, వారి పనుల్లోనే వ్యాయామం ఉండేదని కడప నగర మేయర్ కె. సురేష్‌బాబు అన్నారు. ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం సందర్భంగా ఎముకలు, కీళ్ల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవగాహన కోసం విద్యాసాగర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో 'మెగా వాకథాన్' నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కడప నగర మేయర్ కె. సురేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పూర్వీకులకు ఆరోగ్యకరమైన జీవన శైలి ఉండేదన్నారు. ప్రతి ఒక్కరూ నడవడానికి, వ్యాయామం చేయటానికి కొంత సమయం కేటాయించాలన్నారు. కడప నగర డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, లయన్స్, రోటరీ క్లబ్ నిర్వాహకులు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, కడప పుర ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విద్యాసాగర్ హాస్పిటల్ నుంచి మహావీర్ సర్కిల్ వరకు ప్లకార్డ్సతో వాకథాన్ నిర్వహించారు. కీళ్ల మార్పిడి నిపుణులు డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ ఎముకలు, కీళ్ల సంరక్షణకు తొలి దశలో వ్యాధిని నిర్ధారించడం, ఆరోగ్యకరమైన జీవన శైలి, రోజువారి వ్యాయామం, సమతుల్యమైన ఆహారపు అలవాట్లు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు పోతుల వెంకటరామిరెడ్డి, లయన్ అడ్మిన్ కె. చిన్నపరెడ్డి, లయన్స్‌క్లబ్ జోనల్ చైర్మన్ డాక్టర్ రంగనాథ్‌రెడ్డి, సభ్యుడు కొండూరు జనార్ధన్ రాజు, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ వేణుగోపాల్ రెడ్డి, రాయలసీమ టూరిజం సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంతో ఉన్నతశిఖరాలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, అతిథులు

ఏఎఫ్‌యూ : వ్యక్తిత్వ వికాసంతో ఉన్నతస్థానాలకు చేరుకోవచ్చని రాజంపేట జ్యుడీషియల్ ప్రత్యేక మెజిస్ట్రేట్ విద్వాన్ పసుపులేటి శంకర్ పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్, స్టెప్ సంయుక్త ఆధ్వర్యంలో పర్సనాలిటీ డెవలప్‌మెంట్ - కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద, అబ్దుల్‌కలాం వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్ మాట్లాడుతూ తల్లిదండ్రులు మనపై పెట్టుకున్న ఆశలు నెరవేర్చేలా ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. విశ్వవిద్యాలయ డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. ఉషామాధురీ, ఉదయప్రకాష్‌రెడ్డి, రమాదేవి పాల్గొన్నారు.